
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
శనివారం 26 అక్టోబరు 2024



అద్దె భవనంలో ఇంకెన్నాళ్లు?

- ఆరేళ్లుగా గురుకుల విద్యాలయ స్థల సేకరణలో జాప్యం
- మంజూరైంది నారాయణరావుపేటకు.. కొనసాగుతున్నది పక్క మండలంలోని అద్దె భవనంలో
- అరకొర వసతుల మధ్య విద్యార్థుల చదువులు

8



గురుకులు విద్యాలయం కోసం నారాయణరావుపేట మండలంలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

బియ్యం మాయాజాలం!

- లెక్కతేలని రూ.కోటి 80లక్షల విలువైన 'సీఎంఆర్'
- దుబ్బాక మహేశ్వర రైస్‌మిల్లుకు నోటీసులు
- నెలాఖరులోగా ఇవ్వకపోతే క్రిమినల్ కేసుకు అధికారుల చర్యలు

8

ఆరోగ్యానికి పెద్దపీట..

మిద్దెతోట

7

- మూడేళ్లుగా మిద్దెపై కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్న నీరజారెడ్డి
- తాజా కాయగూరలతో రుచికి రుచి..సంపూర్ణ ఆరోగ్యం



మిద్దెతోటలో డ్రాగన్‌ఫ్రూట్ మొక్క



గుట్టలు, పచ్చని అందాల మధ్య నిండుకుండలా బైరాన్ చెరువు

ప్రకృతి సోయగం.. మహాసముద్రం

కనువిందు చేస్తున్న ఉమ్మాపూర్ – మహ్మదాపూర్ గుట్టలు


ఎత్తైన కొండలు.. మధ్యన జలాశయం.. దీన్ని ఆనుకుని పచ్చని చెట్లు.. చుట్టూ పంట పొలాలు.. పక్షుల కిలకిల రాగాలు.. ప్రకృతి ప్రేమికులను పరవశింపజేసే ఈ రమణీయ దృశ్యాలను చూసి తరించాల్సిందే. ఈ కనువిందైన అందాలు హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్ – మహ్మదాపూర్ గుట్టల్లో దర్శనమిస్తున్నాయి. చిన్నాపెద్ద ఇక్కడికి వచ్చి ప్రకృతిలో సేద తీరుతున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలతో సందడిగా గడిపి మైమరిచిపోతున్నారు.

- ఆహ్లాదాన్ని పంచుతున్న అందాలు
- పిక్నిక్ స్పాట్‌గా బైరాన్‌చెరువు ప్రాంతం
- సెలవు రోజుల్లో చిన్నాపెద్ద సందడి



మహాసముద్రం ప్రాంతానికి వచ్చిన సందర్శకులు

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలంలోని ఉమ్మాపూర్ - మహ్మదాపూర్ గుట్టల అందాలకు చిన్నాపెద్ద ఫిదా అవుతున్నారు. ఇక్కడి మహాసముద్రం జలాశయాన్ని ఆనుకుని ఉన్న బైరాన్‌చెరువు నిండుకుండలా మారింది. ఓవైపు నీళ్లు, వెనుకాల గుట్టలు, చెరువు కట్టపై నుంచి మరో వైపునకు చూస్తే చెట్లు, పొలాలతో



మహాసముద్రం కట్ట కింది భాగాన పచ్చని పొలాలు, చెట్లు

పచ్చదనం కప్పేసిన చిత్రకారులు గీసినట్టు ఉండే ఈ ప్రకృతి అందాలు అందరినీ కట్టిపడేస్తున్నాయి. ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

తరువాయి 8వ పేజీలో

నెల రోజుల్లో పాలిటెక్నిక్ కళాశాల

రూపురేఖలు మారుస్తాం

- 'మా కులం గురుకులం' నినాదంతో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తున్నాం
- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారిగారి ప్రీతం

గజ్వేల్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనిని నెల రోజుల్లో చేసి చూపెడతామని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారిగారి ప్రీతం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ కళాశాలలను ఏర్పాటు చేస్తామని, విద్యారంగాన్ని దేశంలోనే ఆదర్శంగా మారుస్తామన్నారు. గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలోని సౌకర్యాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ మాటలు ప్రచారానికే పరిమితమయ్యాయని, గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను చూస్తే వారు చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. పక్కనే విలాసవంతమైన ఎడ్యుకేషన్‌హబ్‌ను నిర్మించిన కేసీఆర్ పాలిటెక్నిక్ కళాశాలను, హాస్టల్ భవనాన్ని కనీసం మరమ్మతు చేయలేదన్నారు. సోషల్ వెల్ఫేర్ ద్వారా ఉచితంగా అందించాల్సిన భోజనాన్ని స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ కిందకు తీసుకువచ్చి ప్రతీ నెల విద్యార్థుల నుంచి రూ.1700 వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. దళిత బిడ్డలంటే మాజీ సీఎం కేసీఆర్‌కు ఎంత చిన్న చూపు దీనిబట్టే అర్థమవుతుందన్నారు. ఆయన దృష్టిలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలు అంతా శూద్రులేనని చెప్పుకొచ్చారు. ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బాలవికాసతో మాట్లాడామని తెలిపారు. సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డితో మాట్లాడానని సోమవారంలోగా స్పోర్ట్స్ కిట్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రయోగశాలలో కావలసిన సదుపాయాలకు నిధులు ఏర్పాటు చేస్తామన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను సోషల్ వెల్ఫేర్ గొడుగు కిందికి మార్చేందుకు ఉన్నతాధికారి అలుగు వర్షిణికి సూచించామని తెలిపారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.30 లక్షల స్కాలర్షిప్‌లను నెల రోజుల్లోగా విడుదల చేయించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. మా కులం గురుకులం అన్న నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కౌన్సిలర్ షహనాజ్ సమీర్, మాజీ కౌన్సిలర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులున్నారు.



పాలిటెక్నిక్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రీతం

సభ్యుల గైర్హాజరు.. వీగిన అవిశ్వాసం

చిన్నకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండల కేంద్రంలోని అల్లీపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సదానందం, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిపై సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. పీఏసీఎస్‌లో చైర్మన్, వైస్ చైర్మన్‌తో కలిపి మొత్తం 13 మంది పాలకవర్గ సభ్యులున్నారు. గత నెల 28న ఎనిమిది మంది సభ్యులు జిల్లా సహకార సంఘం కార్యాలయంలో అవిశ్వాస లేఖను సమర్పించారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో డీసీవో నాగేశ్వర్‌రావు ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి పాలకవర్గ సభ్యులు ఎవరు హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయిందని డీసీవో ప్రకటించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రఘోత్తంరెడ్డి, ఫీల్డ్ ఇన్‌చార్జి అమృతసేనారెడ్డి, సొసైటీ సీఈవో బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు

- దుద్దెడ టోల్‌గేట్ నుంచి వంటిమామిడి చౌరస్తా వరకు 30 బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

కొండపాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుద్దెడ టోల్‌గేట్ నుంచి వంటిమామిడి చౌరస్తా వరకు రాజీవ్ రహదారిపై ప్రమాదాల ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలను చేపట్టారు. శుక్రవారం గజ్వేల్ డివిజన్‌లోని కుకునూరుపల్లి, గజ్వేల్, గౌరారం, ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రాజీవ్ రహదారిని పరిశీలించి 30 బ్లాక్‌స్పాట్లను(ప్రమాద ప్రదేశాలను) గుర్తించారు. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, సిద్దిపేట హెచ్‌కేఆర్ డీజీఎం విజయభాస్కర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు కలసి కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ మానవ తప్పిదం, అధిక వేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. హెచ్‌కేఆర్, ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారుల సమన్వయంతో థర్మో ప్లాస్టిక్ పెయింట్స్, హజ్డార్డ్ మార్కర్, రేడియం స్టెడ్స్, బ్రింగ్ లెటర్స్ సైనింగ్, వేగ నియంత్రణ బోర్డులను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలు పడగా, వాటిని పూడుస్తామన్నారు. మెయిన్ రోడ్‌కు వచ్చే అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. రాజీవ్ రహదారిపై ఇతర రోడ్లలో కార్నర్ల వద్ద కొమ్మలను తీసేస్తామన్నారు. స్పీడ్ లేజర్ గన్ ద్వారా వేగ నియంత్రణ చర్యలు చేపడతామన్నారు. తరచుగా వాహనాలు తనిఖీ చేసి, మద్యం తాగిన వారికి, అతి వేగంతో వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.



వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద రహదారిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



టమాటను పీల్చేసిన జలగలు, పురుగు ఆశించడంతో పాడయిన టమాటాలు

కూరగాయ పంటను పీల్చేస్తున్నాయ్

టమాట, మిర్చి నారు, బీర్నీస్‌ను ఆశిస్తున్న జలగలు

చిన్నకోడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల పంటలను జలగలు పీల్చేస్తున్నాయి. టమాట, బీర్నీస్, మిర్చి నారును తినేస్తుడంటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకోడూరు మండలంలో ఈ పురుగు బెడద ఎక్కువగా ఉన్నది.

యువ రైతు కనుగుల నాగరాజు మండలంలోని పెద్దకోడూరు శివారులో ఉన్న తన వ్యవసాయ బావి వద్ద అర ఎకరంలో టమాట పంటను సాగు చేశాడు. 20 రోజుల క్రితం చేతికి రాగా ఇటీవల చేలలోని టమాటలకు రంధ్రాలు ఉండి, లోపల గుజ్జును పీల్చి ఉండటాన్ని రైతు గమనించాడు. ఉదయం వేళలో చేనులో పరిశీలించగా ఏమి కన్పించకపోవడంతో అయోమయానికి గురయ్యాడు. చీకటి పడే సమయంలో చేనును నిశితంగా పరిశీలించగా, టమాటలను జలగలు తింటుండడాన్ని గమనించాడు. 40 ప్యాకెట్లు మిరప నారు పోయగా, 5 ప్యాకెట్ల మిరపనారును జలగలు తినేశాయి. ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన బీర్నీస్ మొలకలను సైతం జలగలు తింటున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సమీపంలోని మరో రైతు 15 గుంటల్లో సాగు చేసిన టమాట పంటను పీల్చేస్తున్నాయి. అంతకు ముందు ఆరైతు సాగు చేసిన సోరకాయ చేనుకు ఈ బెడద తప్పలేదని రైతులు తెలిపారు. జలగలు పంటలను ఆశించడం ఏప్పుడూ వినలేదని కూరగాయల రైతులు చెబుతున్నారు. ఈ విషయం గుర్చి ఇటీవల వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా ఉద్యానవన శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఎవరూ పంట క్షేత్రాన్ని సందర్శించలేదని, ఇప్పటికే చాలా నష్టపోయామని, అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఇంకా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జలగలు తుంచి వేసిన మిరప నారు కాండాలు

గురుకులానికి అన్ని వసతులు కల్పిస్తాం

- పోలీస్ గృహ సముదాయంలోకి త్వరలో మార్చండి : కలెక్టర్ మనుచౌదరి
- ప్రభుత్వ భవనాలను సద్వినియోగం చేసుకోవాలి : సీపీ అనురాధ

మర్కుక్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కావాల్సిన అన్ని వసతులను కల్పిస్తామని, కొండపాక మండలంలో అద్దె భవనంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని మర్కుక్‌లోని పోలీస్ గృహ సముదాయంలోకి మార్చాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మర్కుక్ మండలంలో పర్యటించారు. మర్కుక్‌లోని పోలీస్ గృహ సముదాయాన్ని సీపీ అనురాధతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురుకుల విద్యాలయానికి అనుగుణంగా ఇక్కడి ఉమెన్, మెన్ బారెక్స్, స్టాఫ్ క్వార్టర్లు, ఇతర గదుల్లో మార్పులు చేయాలని జిల్లా యంత్రాంగంతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. దాదాపు 600 మంది విద్యార్థినులకు కావాల్సిన సదుపాయాలను కల్పించి, త్వరలోనే ఇక్కడికి మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. టాయిలెట్లు, సంపు నిర్మాణం తదితర పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పంపించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖకు సూచించారు. అనంతరం వారు మర్కుక్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ, రిసెప్షన్, రైటర్, స్టాఫ్, లాకప్, ఎస్ఐ గదులను పరిశీలించారు. మర్కుక్ ఎస్ఐ దామోదర్ విచారణ ప్రక్రియను కలెక్టర్‌కు వివరించారు. వారి వెంట గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, అదనపు డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, సాంఘిక సంక్షేమ జోనల్ అధికారి ప్రత్యూష, ప్రిన్సిపాల్ సవిత, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధికార యంత్రాంగంతో మర్కుక్‌లోని పోలీస్ గృహ సముదాయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

తక్షణమే 'కస్తూర్బా' సమస్యలను పరిష్కరించాలి

ఎంపీడీవో, తహసీల్దార్‌ను ఆదేశించిన కలెక్టర్

8

సీతాఫలం.. జోరుగా బేరం

చేర్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి శివారు మల్లన్న ఆలయ స్వాగత తోరణం ఆవరణలో సీతాఫలాల అమ్మకం జోరుగా సాగుతుంది. కొమురవెల్లి, రాంసాగర్, గురువన్నపేట, తపాస్‌పల్లి, ఐనాపూర్, గౌరాయపల్లితో పాటు కొండపాక మండలంలోని పలు గ్రామాల శివారు గుట్టల్లో సీతాఫలాల చెట్లు ఉండటంతో విరివిగా ఫలాలు కాస్తున్నాయి. ఆయా గ్రామాల రైతులు, కూలీలు సీతాఫలాలను తెంపుకు వచ్చి మల్లన్న ఆలయ స్వాగత తోరణం వద్ద, రాజీవ్ రహదారి పక్కన అమ్ము తున్నారు. చిన్న గంపకు రూ.200, ట్రేకు రూ.500 ధర చెబుతున్నారు.





బేరమాడుతున్న ప్రయాణికులు, రాజీవ్ రహదారి పక్కన సీతాఫలాల విక్రయం

హుస్నాబాద్‌లో మెగా ఫారిన్ జాబ్ మేళా

నవంబరు రెండో వారంలో నిర్వహణ

హుస్నాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నవంబరు రెండోవారంలో హుస్నాబాద్‌లో మెగాఫారిన్ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో టాంకాం ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి స్కిల్స్ ఆధారంగా వివిధ దేశాల్లో మంచి జీతాలతో ఉద్యోగావకాశాలు కల్పించేలా మేళాను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్రైం కార్నర్

చోరీకి పాల్పడిన మహిళలపై కేసు

కల్హేర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కల్హేర్‌లో దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం శుక్రవారం తెలిపారు. కల్హేర్‌కు చెందిన బత్తిని పద్మ భర్త సంగయ్యతో కలిసి ఈ నెల 15న ఇంటికి తాళం వేసి సోయా పంట కోయడానికి వెళ్లారు. ఈ సమయంలో కల్హేర్‌కు చెందిన మీసాల గంగవ్వ, శేగోళ్ల చంద్ర కళ, అల్లాపురం ఉమా ఆ ఇంటిలోకి చొరబడి పెట్టెలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడు, ఐద మాసాల బంగారు కమ్మలు, 20 తులాల వెండి కడియాలు, 10 తులాల వెండి పట్టి గొలుసులు, రూ.30 వేల నగదును తస్కరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితుల నుంచి చోరీ సొత్తు రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డారం బాల్‌చంద్రం(32) ఈ నెల 23 రాత్రి నిద్రిస్తుండగా 12.30గంటల సమయంలో పాటు కాటు వేసింది. వెంటనే ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు.

గుండెపోటుతో..


రవి(ఫైల్)

మనోహరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తుండగా గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన తప్పెట రవి (54) శుక్రవారం ఉదయం మనోహరాబాద్ గ్రామంలోని బాలాజీ పార్కుకు వాకింగ్ కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. నడుస్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమచారం అందుకున్న కుటుంబీకులు, పోలీసులు అక్కడికి చేరుకుని రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రవి కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధి బాధపడుతూ మందులు వాడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తమ్ముడు తప్పెటి హరి బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆరోగ్యానికి పెద్దపీట.. మిద్దెతోట

- మూడేళ్లుగా మిద్దెపై కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్న నీరజారెడ్డి
- సేంద్రియ ఎరువుల వినియోగం
- తాజా కాయగూరలతో రుచికి రుచి.. సంపూర్ణ ఆరోగ్యం

కొడిపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేడు సాగులో మోతాదుకు మించి రసాయనిక మందులు, ఎరువుల వినియోగం సర్వ సాధారణమైంది. అలా పండించిన కూరగాయలు, పండ్లు తినడంతో చిన్న వయస్సులోనే అనేక రోగాలు దరి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో తన కుటుంబానికి తాజా కూరగాయాలు, పండ్లు అందించాలనే ఆలోచనే ఆమెను మిద్దెతోట సాగు చేపట్టేలా చేసింది. కూరగాయలు, పండ్లే కాదు పసుపు, చింతపండు, అల్లం, పూలు కూడా పండిస్తూ శభాష్ అనిపించుకుంటున్నది. రెండు అంతస్తుల ఇంటి మిద్దెపై మూడేళ్లుగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ తన కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని చేకూర్చుతున్న కొడిపల్లి మండల కేంద్రానికి చెందిన మట్ట నీరజారెడ్డిపై ప్రత్యేక కథనం.

రూ.4లక్షలతో..

1992 సంవత్సరంలో తన ఇంటి ఆవరణలో చిన్న చిన్న సంచులలో ఇంటికి సరిపడా కూరగాయాల సాగు చేసేది. ఇదే క్రమంలో మూడు సంవత్సరాల నుంచి రెండు అంతస్తుల మిద్దెపై సుమారు 450 గజాల స్థలంలో ప్లాస్టిక్ బకెట్లు, సంచులు, పెద్ద పెద్ద కుండీలు సిమెంట్ ఇటుకలతో రూ.4 లక్షల వరకు ఖర్చు చేసి తోటల సాగుకు అనువుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. కోతుల బెడద నుంచి మొక్కలను కాపాడుకునేందుకు గ్రిల్స్ కూడా పెట్టించారు. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా మట్టి, పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులతోనే సాగు చేస్తున్నారు. తన కుటుంబానికి సరిపడేలా అన్ని రకాల పంటలు సాగు చేస్తున్నారు.

ఏమేమీ పండిస్తున్నారంటే..

టమాటా, వంకాయ, బెండకాయ, మిరపతోపాటు తీగజారే దొండకాయ, బీరకాయ, సోరకాయ, కాకర, చిక్కుడు కూరగాయలను కూడా పండిస్తున్నారు. మునగ కాయలు, గోంగూర, తోట కూర, పాలకూర, చుక్కకూర, పూదిన, కోతిమీర, చెనంగి, కరివేపాకును సాగు చేస్తున్నారు. అలాగే జామ, అంజీర్, స్టార్, డ్రాగన్, సపోట, దానిమ్మ, నిమ్మ, ఆపిల్ బేర్, బొప్పాయి, ప్యాషన్, అరటి వంటి పండ్లతో పాటు చింత పండు, మిరియాలు, పత్తి సాగు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఇక పూలైతే లెక్కనేలేదు. బంతిపూలు, చామంతి, గులాబి, కనకంబారాలు, శంఖం, మల్లె, జాజి మల్లె తదితర రకాల పూలు పండిస్తున్నారు.

బయటం కొనడం బంద్ : నీరజారెడ్డి

తమ కుటుంబానికి అవసరమైన కూరగాయలు, పండ్లు తమ మిద్దెపైనే పండించుకుంటున్నాం. దీంతో గత మూడేళ్లుగా తాను కూరగాయలు కొన్న దాఖాలులేవు. నిత్యం ఉదయం చెట్లకు నీరు పెట్టడం చాలా సంతోషంగా ఉంటుంది. పెరటి, మిద్దె తోటలతో కుటుంబానికి నాణ్యమైన కూరగాయలు అందించడమే కాకుండా కుటుంబానికి ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు అవుతుంది.


బంతిపూల మొక్కలు చూపిస్తున్న నీరజారెడ్డి

పసుపు, అల్లం ప్రత్యేకం

గత సంవత్సరం మిద్దెపై 30 కేజీల పచ్చి పసుపు దిగుబడి వచ్చిందని నీరజారెడ్డి తెలిపారు. దీన్ని ఉడక బెట్టడంతో తమ కుటుంబానికి సంవత్సరానికి సరిపడా 10 కేజీల వరకు వచ్చినట్లు చెప్పారు. ఈ సంవత్సరం 50 కేజీల పసుపు పండించడమే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. మిద్దె తోటలో పండించిన కూరగాయలు, పండ్లు ఎంతో రుచికరంగా ఉండడంతోపాటు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని చెప్పారు. పచ్చి పసుపు మహిళలకు ఎంతో మేలు చేస్తుందని, పచ్చి అల్లం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని చెప్పుకొచ్చారు.


బేబి టమాటా మొక్కలు


పసుపు మొక్కలు

క్రైం కార్నర్

పాత కక్షలతో కడతేర్చారు

- వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మహేష్‌గౌడ్

సదాశివపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేటలో ఈ నెల 21న జరిగిన వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు వ్యక్తులు పాత కక్షలతోనే వ్యక్తిని దారుణంగా హత్య చేసినట్లు విచారణలో తేలింది. వివరాలలోకి వెళ్తే.. సదాశివపేటలోని సిద్ధాపూర్ కాలనీ చెందిన అనీల్‌రాజ్ గత ఆదివారం రాత్రి హత్యకు గురయ్యాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అజయ్ రాజ్, రాజేశ్ నిందితులుగా గుర్తించారు. రెండు సంవత్సరాల క్రితం అజయ్ రాజ్ తల్లి చనిపోవడానికి అనీల్ రాజు కారణమని, అంతేకాకుండా సదాశిపేట పట్టణానికి చెందిన రాజేష్ తన కుటుంబం అనీల్ రాజు వల్లనే విడిపోయిందన్న కారణంతో పగ పెంచుకున్నారు. అనీల్ రాజును ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుని గత ఆదివారం రాత్రి పేకాట ఆడుదామని సిద్ధాపూర్‌కాలనీలోని రేకుల షెడ్డులోకి తీసుకెళ్లారు. పేకాట ఆడాక అనిల్ రాజును అజయ్ పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో పొడవగా.. రాజేష్ అతడికి సహకరించాడు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ముఖ్య పాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ ఎండీ జావిద్, అఫ్జల్, కానిస్టేబుళ్ల వెంకటేశం, హోంగార్డులు వీరేశం, రమేష్‌ను డీఎస్పీ సత్తయ్య అభినందించారు.

ఇద్దరు దొంగలు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ అభిలాష్

కోహెడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ అభిలాష్ శుక్రవారం వెల్లడించారు. కోహెడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వాహనం వదిలి పారిపోతున్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన రేగుల శ్రీనివాస్, అతని స్నేహితుడు పెసరు పరశురాములు పలు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. శనిగరంలోని పెద్దమ్మ ఆలయం, చెంచల్‌చెరువుపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయం, కూరెళ్లలోని ఎల్లమ్మ ఆలయం తలుపులను పగులగొట్టి హుండీల డబ్బులు, దేవత మూర్తుల మెడలో ఉన్న బంగారు ఆభరణాలు దొంగలించినట్లు నిందితులు చెప్పారు. అలాగే కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, గన్నేరువరం మండలాల్లోని పలు గ్రామాల్లోనూ దొంగతనాలు చేసినట్లు తెలిపారు. చోరీ సొత్తును వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన షేక్ ఇమామ్ అనే వ్యక్తికి విక్రయించారు. షేక్ ఇమామ్ నుంచి బంగారం రికవరీ చేసి ఇతనితోపాటు ఇద్దరు దొంగలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగకు రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న తొగుట సీఐ లతీఫ్

రాయపోల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం అనాజీపూర్ గ్రామానికి చెందిన కొనేరు యాదగిరి మద్యానికి బానిసై డబ్బుల కోసం బైకులను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. 15 రోజుల క్రితం మరో వ్యక్తితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి బాహూజీనగర్‌లో రోడ్డు పక్కన నిలిచి ఉంచిన బైకు తాళాలు పగులగొట్టి దొంగిలించారు. ఆ బైకును అనాజీపూర్‌లో ఓ వ్యక్తికి విక్రయించి డబ్బులతో జల్సాలు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 18న మధ్యాహ్నం రాయపోల్ వైన్స్‌లో మద్యం తాగి జీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ ఎదుట ఆపి ఉంచిన స్కూటీని దొంగిలించారు. శుక్రవారం స్కూటీని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తూ అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలు బయటపడ్డాయని సీఐ వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆదర్శం.. ఆ టీచర్

- భార్య మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగింత
- గతంలో తండ్రి మృతదేహం కూడా..


రుక్మిణి (ఫైల్)

హత్నూర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన తన భార్య మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించి తన ఔనత్యాన్ని చాటుకున్నాడు ఉపాధ్యాయుడు. హత్నూర మండలం గుండ్ల మాచునూర్‌నూర్ గ్రామానికి చెందిన సాయమొళ్ల చంద్రయ్య హత్నూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన చిన్నతనం నుంచే సామాజిక రంగాలలో చురుకైన పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతున్నాడు. శుక్రవారం ఉదయం ఆయన భార్య సాయమొల్ల రుక్మిణి(51) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. పుట్టెడె దుఃఖంలోనూ సామాజిక దృక్పథంలో ఆలోచించి ఆమె మృతదేహాన్ని సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలకు విద్యార్థుల పరిశోధన నిమిత్తం అప్పగించారు. 2019 సంవత్సరంలో ఆయన తండ్రి సాయమొల్ల పోచయ్య మృతదేహాన్ని కూడా కళాశాలకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపేదే జర్నలిజం

- జర్నలిస్టుల వర్క్‌షాప్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేదే జర్నలిజమని, విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి మేలు చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభిప్రాయపడ్డారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోల ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు ప్రముఖ ప్రాత వహిస్తున్నారన్నారు. వారు రాసే ప్రతీ వార్త పేద ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలనానరు. వివిధ అవసరాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే విద్యార్థినులు, మహిళలకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సంతలు నిర్వహించే ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం జరగాలన్నారు. ఇలాంటి వాటిపై జర్నలిస్టులు వార్తలు రాసి సమాజానికి మేలు చేయాలని కోరారు.

నిజమైన వార్తలు ప్రచురించాలి:

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

జర్నలిజలం చాల ప్రవితమైన వృత్తి అని, నిజమైన వార్తలు ప్రచురించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సమాజంలోని వివక్ష, మూఢనమ్మకాలు, సామాజిక బహిష్కరణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ప్రజలను చైతన్యపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న విద్యార్థిని

న్యాల్‌కల్ కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

13 మంది విద్యార్థినులకు అస్వస్థత

జహీరాబాద్/న్యాల్‌కల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఫుడ్ పాయిజన్ అయ్యి 13 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వణుగు, నిరంతర పొడిదగ్గుతో ఇబ్బంది పడుతున్న వారిని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలియగానే విద్యార్థినుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. 13 మందిలో ఐదుగురు కోలుకోగా వారిని డిశ్చార్జి చేశారు. మిగిలిన 8 మంది ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఫుడ్ పాయిజన్ కారణంగానే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న డీఈవో వెంకటేశ్వర్లు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదేశించారు. ఫుడ్‌పాయిజన్‌కు నూనె, కలుషిత నీరే కారణమై ఉంటుందన్న అంచనాకు వచ్చారు. విద్యార్థినులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. డీఈవో వెంట ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవో మారుతీ, కేజీబీవీల ప్రత్యేక అధికారి రుబీనాపర్వీన్, సీహెచ్‌వో వెంకటేశం తదితరులున్నారు.


చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రెండు చోట్ల భారీ అగ్ని ప్రమాదాలు

- చిన్నశంకరంపేట ఎలిమెంటల్ పరిశ్రమలో షార్ట్‌సర్క్యూట్‌తో ఎగిసిపడి మంటలు
- రూ.కోటి ఆస్తి నష్టం
- తూప్రాన్ లిమ్రా మోటార్స్ షెడ్డులో 9 కార్లు దగ్ధం..

చిన్నశంకరంపేట/తూప్రాన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో రెండు వేర్వేరు చోట్ల భారీ అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట శివారులోని ఎలిమెంటల్ మొలల పరిశ్రమలో శుక్రవారం ప్యాకింగ్ ప్లాంట్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో కార్మికులు బయటకు పరుగులుతీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు అక్కడికి చేరుకుని నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను చల్లార్చారు. సుమారు రూ. కోటి ఆస్తి నష్టం జరిగిందని పరిశ్రమ యజమాని రాజేశ్ అగర్వాల్, ప్యాకింగ్ ప్లాంట్ మేనేజర్ జైకిసాన్ వెల్లడించారు.

మరో ఘటనలో కార్లు..

తూప్రాన్ నర్సాపూర్ చౌరస్తా వద్దగల లిమ్రా మోటార్స్‌లో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. యజమాని సోయల్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజూవారి లాగే కారు మెకానిక్ షెడ్డును మూసేసి ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి తరువాత మంటలు చెలరేగుతున్నట్లు అతడికి సమాచారం వచ్చింది. ఈ ఘటనలో 9 కార్లు కాలిపోగా.. సుమారు రూ. 28 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు సోయల్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి తరువాత ఓ వ్యక్తి షెడ్డులో సంచరించినట్లు సీసీ పుటేజీల్లో నమోదైందని, అతడి వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని యజమాని ఆరోపించారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.


చిన్నశంకరంపేట ఎలిమెంటల్ మొలల పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు

గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ

మునిపల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల నాయకుడు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడతూ జీపీ వర్కర్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు ఇమానియల్, వర్కర్లు రవి, విఠల్ గౌడ్, బిక్షపతి, దశరథ్, శ్రీను, కమలయ్య, లక్ష్మి, సుశీల, చంద్రకళ,చంద్రమ్మ, బాబు, ప్రభాకర్, శివకుమార్, కిష్టయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు.. పరిశ్రమకు..!

- రంగాయపల్లికి నెల రోజులుగా సరఫరా బంద్.. రోడెక్కిన మహిళలు


గ్రామస్థులతో మిషన్ భగీరథ ఏఈ శ్రీధర్

మనోహరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) 25: మనోహరాబాద్ మండలం రంగాయపల్లి, కోనాయపల్లి గ్రామాలకు నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో శుక్రవారం రంగాయపల్లి గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో గ్రామ పంచాయితీ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఒక మహిళ కోపంతో నీటి బిందెను పగలకొడుతూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆందోళన విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ ఏఈ శ్రీధర్ అక్కడికి చేరుకుని నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గజ్వేల్ నియోజకవర్గం కోమటిబండ నుంచి మిషన్ భగీరథ నీరు గజ్వేల్ చుట్టూ పక్కల గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కాగా, సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండమైలారం గ్రామంలో నిర్మిస్తున్న ప్రైవేటు కోకాకోలా పరిశ్రమకు మనోహరాబాద్ మండల కేంద్రానికి వచ్చే మిషన్ భగీరథ నీటిని మళ్లించడంతోనే సమస్య ఏర్పడిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమకు నీటి మళ్లింపు విషయమై వారం క్రితం భగీరథ ఏఈ శ్రీధర్ వివరణ కోరగా ఇతర పరిశ్రమల నుంచి నీటిని తక్కువ చేసి కోకాకోలా పరిశ్రమకు తరలిస్తున్నట్లు చెప్పారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

కొండపాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలికట్ట నుంచి జనగామ రోడ్డు వరకు, అలాగే గ్రామం రాజీవ్ రహదారి వరకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలస్వామి కోరారు. వెలికట్ట గ్రామ సీపీఎం మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెలికట్ట గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పార్టీ శాఖ నిరంతరం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో బాల నర్సయ్య, మండల కమిటీ సభ్యుడు ముడోజు కనకాచారి, తటోజు రవీంద్ర చారి, కనకయ్య తదితరులున్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాల పట్టివేత

కుకునూరుపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముద్దాపూర్ గ్రామ శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ కుకునూరుపల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారంతో ముద్దాపూర్ గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున తనిఖీలు చేసి మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 19 మందికి జరిమానా విధిస్తూ గజ్వేల్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పు వెలువరించారని ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరాస్తాల్లో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 19మంది మద్యం సేవించి పట్టుబడ్డారు, వారిని శుక్రవారం కోర్టులో హాజరుపరుచగా, రూ.24వేల జరిమానా విధించారన్నారు.

అద్దె భవనంలో ఇంకెన్నాళ్లు?

ఆరేళ్లుగా గురుకుల విద్యాలయ స్థల సేకరణలో జాప్యం

- మంజూరైంది నారాయణరావుపేటకు..

కొనసాగుతున్నది పక్క మండలంలోని అద్దె భవనంలో



ఎల్లంకి కళాశాల అద్దె భవనంలో గురుకుల బాలుర పాఠశాల

సిద్దిపేట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల క్రితం నారాయణరావుపేట మండల కేంద్రానికి మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేశారు. పాఠశాలకు శాశ్వత భవనం కోసం స్థల సేకరణకు ఆదేశాలు వచ్చినప్పటికీ, ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లోపంతో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు నాలుగు దఫాలుగా స్థల సేకరణ చేసి అనుమతుల కోసం పంపించినప్పటికీ నిర్మాణానికి అనువైనది కాదంటూ మరో స్థలాన్ని చూడాలని సంబంధిత శాఖ అధికారులు తిరస్కరిస్తూ కాలయాపన చేస్తున్నారు.

అరకొర వసతులతో అద్దె భవనంలో..

బాలుర గురుకుల పాఠశాల (నారాయణరావుపేట) 2017 నుంచి అద్దె భవనానికి నెలకు రూ.4 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తున్నది. ప్రారంభంలో సిద్దిపేట పట్టణ శివారులోని లింగారెడ్డిపల్లిలో ఉన్న బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఆ భవనం సరిపోకపోవడంతో చిన్నగుండవెల్లి శివారులోని ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలకు మార్చారు. ప్రతీ యేటా తరగతులు అప్‌గ్రేడ్ అవుతూ పాఠశాల జూనియర్ కళాశాల స్థాయికి చేరింది. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు 392 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 39 మంది విద్యార్థులతో కొండపాక మెదక్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్నది. నారాయణరావుపేట మండలంలో ఉండాల్సిన గురుకుల విద్యాలయం అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా పక్క మండలంలో కొనసాగుతున్నది. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు సరైన వసతులు లేవని, సొంత భవనం లేదని తమ పిల్లలను పాఠశాల మాన్పిస్తున్నారు. భూమి సర్వేల పేరుతో కాలయాపన మాని త్వరగా స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కాలయాపన



గత ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా స్థల సేకరణలో కాలయాపన జరిగింది. మండల కేంద్రంలో పాఠశాల ఏర్పాటు చేస్తే చుట్టూ ఉన్న గ్రామాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ విషయాన్ని ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో స్థలం కేటాయించాలని కలెక్టర్‌తో మాట్లాడారు. అధికారులు త్వరితగతిన స్థల సేకరణ పూర్తి చేయాలి.

- పొన్నాల బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు, నారాయణరావుపేట

కమీషన్ల కోసం అద్దె భవనంలో



కొందరు నాయకులు కమీషన్ల కోసం గురుకుల పాఠశాలను అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరు చేయించేందుకు అవకాశం ఉన్నా కాలయాపన చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రం ఏర్పాటు చేయడం ఇష్టం లేని కొందరు స్వార్థ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఆరేళ్లుగా కోట్ల రూపాయల అద్దె చెల్లించారు.

- కరుణాకర్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, నారాయణరావుపేట

స్థల సేకరణ చేసి ఉన్నతాధికారులకు..



గురుకుల పాఠశాల నిర్మాణం కోసం భూ సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. గతంలోనూ రెండుసార్లు భూమి కేటాయించారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి అనుకూలంగా లేదని తిరస్కరించారు. సర్వే నంబర్ 616లోని ప్రభుత్వ భూమిలో 5.35 ఎకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్, ఆర్డీవోకు తుది నివేదిక పంపించాం. స్థలం కేటాయింపులో అధికారుల కాలయాపన చేస్తున్నారన్నది అవాస్తవం.

- లక్ష్మారెడ్డి తహసీల్దార్, నారాయణరావుపేట

బియ్యం మాయాజాలం!

లెక్కతేలని రూ.కోటి 80లక్షల విలువైన 'సీఎంఆర్'

దుబ్బాక, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో రైస్‌మిల్లర్ల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంది. సుమారు రూ.కోటి 80లక్షల విలువైన బియ్యాన్ని అందించకపోవడంతో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు మిల్లు భాగస్వాములకు నోటీసులు అందించగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దుబ్బాక మున్సిపాలిటీ లచ్చపేటలోని మహేశ్వర రైస్‌మిల్లుకు గతేడాది 55.99 ఏసీకేల బియ్యాన్ని కేటాయించారు. అయితే రైస్‌మిల్లులోని ఇద్దరు భాగస్వాములు మరణించడంతో బియ్యం లెక్కతేలలేదు. జిల్లా అధికారులు రైస్‌మిల్లుకు చెందిన ఇతర భాగస్వాములను పిలిచి బియ్యం కస్టం మిల్లింగ్ రైస్ సకాలంలో అందించాల్సిందేనని ఆదేశించారు. బియ్యం వ్యవహారం తమకు తెలియదని, భాగస్వాముల సంతకాలు లేకుండా వడ్లను ఎలా కేటాయించారనే వాదనను వారు జిల్లా అధికారుల ముందుంచినట్లు తెలిసింది. ఇదే అంశాన్ని అవకాశంగా మార్చుకుని బియ్యం వ్యవహారంలో భాగస్వాములు చేతులెత్తేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు మిల్లునుంచి కేటాయించిన 55.91 ఏసీకేల బియ్యంలో 38.26 ఏసీకేల బియ్యంను రికవరీ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. వారినుంచి రావాల్సిన 17.65 ఏసీకేల బియ్యం సుమారు రూ.కోటి 80లక్షల బియ్యం తేలకపోవడంతో ఈనెల 30 వరకు తమకు అందించాల్సిందేననీ అధికారులు వారం క్రితం మిల్లు భాగస్వాములు పదిమందికి నోటీసులు జారీ చేశారు. గడువులోగా బియ్యం అందించకపోతే క్రిమినల్ చర్యలకు కూడా జిల్లా అధికారులు సిద్ధమయ్యారు.

సంక్షేమ పథకాలు అందించే బాధ్యత నాదే

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న పల్లా

చేర్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎవరికీ ఒక్కపైసా ఇవ్వొద్దని, అర్హులకు సక్రమంగా అందించే బాధ్యత తనదేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాలకు చెందిన 64మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.17,94,500 లక్షల చెక్కులను శుక్రవారం స్థానికంగా ఓ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాలకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబాన్ని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఆయా కార్యక్రమాలలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన'

కోహెడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని మాజీమంత్రి, హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ సభ్యత్వ నమోదు ప్రవాసి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. కోహెడలో పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన బీజేపీ సభ్యత నమోదు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, అసెంబ్లీ ఇన్‌చార్జి లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, కో కన్వీనర్ జనగామ వేణుగోపాల్ రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఎన్జీటీ కేసును ఉపసంహరించుకోవాలి

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్గల్ ఇండస్ట్రియల్ పార్కుపై వేసిన ఎన్జీటీ కేసును ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం వర్గల్ మండల కేంద్రంలో గత ప్రభుత్వం 1100ఎకరాలను సేకరించిందని, కానీ కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఎన్జీటీలో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. 15రోజుల్లో ఎన్జీటీ కేసును ఉపసంహరించుకోని పక్షంలో ఇండస్ట్రియల్ పార్కు వద్ద నిరహారదీక్ష చేపడుతామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని గాగిల్లాపూర్, బెజ్జంకి క్రాసింగ్, గుగిళ్ల, తిమ్మాయిపల్లి, రేగులపల్లి, చీలాపూర్, పెరుకబండ, గుండారంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్, ఏపీఎం నర్సయ్య, ఏఎంసీ, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. బెజ్జంకి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులు, రైతులకు పలు సూచనలు చేశారు. వారివెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఏపీఎం నర్సయ్య, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

- నంగునూరు: మండలంలోని జెపి తండా, మగ్దూంపూర్, బద్దిపడగ, అప్పలాయ చెరువు, నాగరాజుపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలమాకుల పీఏసీఎస్ చైర్మన్ ఎల్లంకి మైపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ లింగము, ఏఈవో రేణుక, గ్రామ ఐక్య సంఘం మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- చిన్నకోడూరు: మండలంలోని రాముని పట్ల, కస్తూరిపల్లి, ఓబులాపూర్ గ్రామాల్లో గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, గోనెపల్లి, ఇబ్రహీంనగర్, చిన్నకోడూరు, మాచాపూర్, గంగాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఏపీఎం ఆంజనేయులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సీసీలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకి: గాగిల్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రకృతి సోయగం.. మహాసముద్రం

(ఐదో పేజీ తరువాయి)

వారాంతంలో మహాసముద్రం ప్రాంతాన్ని సందర్శించేవారు పెరిగిపోతున్నారు. ఇటీవల కాలంలో సెలవుల్లో తమ పిల్లాపాపలతో వచ్చి ఇక్కడ సందడి చేస్తున్నారు.

సరదాగా.. ఉత్సాహంగా

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సహజసిద్ధంగా గుట్టల పైభాగం నుంచి వచ్చిన వరద నీటితో మహాసముద్రం నిండు కుండలా మారి మత్తడి దూకింది. శని, ఆదివారాల్లో అయితే అనేక మంది కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో మహాసముద్రం ప్రాంతానికి వచ్చి ఇక్కడే వంటలు వండుకుని వనభోజనాలు చేస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లాపాపలతో సందడి చేస్తున్నారు. కొందరు మహాసముద్రం జలాశయంలో ఈతకొడుతూ సరదా చేస్తున్నారు. మరికొందరు పచ్చిక బైళ్లపై ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడిపేస్తున్నారు. చుట్టు కొండల మధ్యన ఉన్న జలాశయం పక్కన సెల్ఫీలు దిగుతున్నారు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేనప్పటికీ ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న ఆట వస్తువులతో పిల్లలు, యువకులు హంగామా చేస్తున్నారు. హుస్నాబాద్ ప్రాంతంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు తీసుకువస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించాల్సి ఉంది. త్వరగా పనులు పూర్తి చేస్తే మహాసముద్రం ప్రాంతం పర్యాటక క్షేత్రంగా విలసిల్లుతుంది.



నిండుకుండలా మహాసముద్ర జలాశయం

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని సిద్దిపేట ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొడం సంజీవ్ కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతున్నా స్కాలర్‌షిప్స్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాటిని విడుదల చేయని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అంతకు ముందు సిద్దిపేట కొత్త బస్టాండ్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి గేటు ఎదుట బైఠాయించారు. అనంతరం తహసీల్దార్ సలీంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఏఐఎస్ఎఫ్ జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు.

రాజాపేటకు సాగునీరు అందించాలి: బీఆర్ఎస్

జగదేవ్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ జలాశయం నుంచి 15వ ప్యాకేజీ ద్వారా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని రాజపేట మండలంలోని చెరువులను నింపి ఇక్కడి రైతులను ఆదుకోవాలని రాజాపేట మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. రాజాపేట మండల బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జగదేవ్‌పూర్‌లోని కాళేశ్వరం కాలువను వారు సందర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మదర్ డైరీ మాజీ డైరెక్టర్ చింతపూరి వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గోపాల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

'పశువులను గోవధకు తరలించొద్దు'

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పశువుల అంగడి నుంచి ప్రతీ శుక్రవారం ఆరోగ్యంగా ఉన్న పశువులను కటిక వ్యాపారులు గోవధశాలకు తరలిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు వినతిపత్రం సమర్పించారు. అంగడిలో వెటర్నరీ డాక్టర్ అనుమతులు ఇచ్చిన తర్వాతే కటిక వ్యాపారులు పశువులను కొనుగోలు చేయాలని, కానీ ఎలాంటి అనుమతులు లేకుండా ఆరోగ్యంగా ఉన్న పశువులను కొనుగోలు చేసి గోవధశాలకు తరలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, ఎలగందుల శంకర్, వేల్పుల రాజు, సుధాకర్ ఉన్నారు.

'రెవెన్యూ డివిజన్‌తోనే చేర్యాల అభివృద్ధి సాధ్యం'

చేర్యాల, అక్టోబరు 25 : రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోనే చేర్యాల అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో అన్నారు. చేర్యాల మండలం తాడూరులలో శుక్రవారం నిర్వహించిన పార్టీ గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేర్యాల ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు.

'ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి'

మద్దూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ధర్మారం, లద్నూరు గ్రామాల్లో 2024-25లో చేపట్టిన పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, లైనూన్ అధికారి నూరద్దీన్, ఎంపీడీవో రామ్మోహన్, ఈసీ పరుశురాములు, టీఏలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- ఏడీఏ పద్మ

సిద్దిపేట రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆయిల్‌పామ్ పంటలను సాగు చేస్తే అధిక లాభాలు గడించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ డివిజనల్ అధికారి పద్మ సూచించారు. నారాయణరావుపేట మండలం మల్యాల, గుర్రాలాగొంది‌లో శుక్రవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మ మాట్లాడుతూ.. రైతులు ఆయిల్‌పామ్ తోటల సాగుపై అనవసర అపోహలకు పోయి చెట్లను తొలగిస్తున్నారన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగుకు కొంత సమయం పట్టినప్పటికీ మంచి లాభాలు గడించేందుకు అవకాశం ఉందని, అంతర్ పంటల్లో భాగంగా వరి పంట మినహా అన్ని రకల ఆరుతడి పంటలు సాగుచేసుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

- గజ్వేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్



రక్తదాన శిబిరంలో సాయికిరణ్, వైద్యులు, సిబ్బంది

గజ్వేల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని గజ్వేల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ అన్నారు. గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి రక్తం చాలా అవసరమని, అత్యవసరంగా రక్తం ఎక్కించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవానీ, డాక్టర్ నవ్య, సీఏఎస్ నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, స్వరూపరాణి, హెడ్ నర్సు ఉమా, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ అధికారి మెహరాజ్, హెల్త్ అసిస్టెంట్ డి. వాసుదేవ్, నర్సింగ్ అధికారి నాగమణి, శశికళ, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ ప్రణీత్ సిద్దిపేట బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి సాగర్, శివ, దేవేందర్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి మరో రూ. 30 లక్షలు

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న గ్రంథాలయానికి మరో రూ. 30 లక్షలు మంజూరయ్యాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. హుస్నాబాద్‌లో నిర్మిస్తున్న గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించారు. గజ్వేల్, దుబ్బాక, మిరుదొడ్డిల్లో కూడా గ్రంథాలయాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కాంట్రాక్టర్ మాధవరెడ్డి, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

తక్షణమే 'కస్తూర్బా' సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీడీవో, తహసీల్దార్‌ను ఆదేశించిన కలెక్టర్ మనుచౌదరి



కుకునూరుపల్లి: కళాశాలలో నిర్మిస్తున్న ఏటీసీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

మర్కుక్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తక్షణమే కస్తూర్బా బాలికల విద్యాలయంలోని సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరి ఎంపీడీవో అబ్బులుద్దీన్, తహసీల్దార్ ఆరీఫాను ఆదేశించారు. మర్కుక్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. గతంలో 'ఆంధ్రజ్యోతి'లో 'కస్తూర్బా కంపు కంపు' శీర్షికన ప్రచురితమైన డ్రైనేజీ సమస్య గురించి పాఠశాల ఎస్‌వో భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ తుమ్మ కృష్ణతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్య, వాష్‌రూమ్, వాననీరు బయటకు వెళ్లే పనులు వెంటనే ప్రారంభించి, వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆడబిడ్డల సంరక్షణ కోసం బిల్లులు రాకపోయినా సొంత ఖర్చులతో డ్రైనేజీ పనులు చేస్తున్న మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి, తుమ్మ కృష్ణని కలెక్టర్ అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు 10 జీపీఏ లక్ష్యంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్యాకేజీ మంజూరు చేయాలి

మల్లన్నసాగర్ ముంపు గ్రామ బాధితుడు ఎర్రవల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుంటనోళ్ల శివకుమార్ కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముంపు గ్రామ బాధితులను గత ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని చెప్పి తీరా ఇల్లు ఖాళీ చేశాక మాట దాటవేసిందని, చాలా మందికి ప్యాకేజీలు ఇస్తామని ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువత అంతా ఖాళీగా ఉంటూ గంజాయికి అలవాటు పడుతున్నారని ఇప్పటికైనా ముంపు గ్రామ బాధితులకి పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీని మంజూరు చేయించి యువతకి ఉపాధి అవకాశాలను కల్పించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

కళాశాలను సందర్శించిన కలెక్టర్

కుకునూరుపల్లి: మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలను కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించి, పీఎం విశ్వకర్మ శిక్షణలో అభ్యర్థులు చేతితో తయారుచేసిన కళాకృతులను పరిశీలించారు. అనంతరం వర్క్‌షాప్‌ను పరిశీలించారు. ఏటీసీలోని ఆర్టిఫిషియల్ యూజింగ్ అడ్వాన్సింగ్ టూల్ విభాగంలో అడ్మిషన్లు పొందిన ఐదుగురు అమ్మాయిలకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు. ఆయనవెంట ఆర్డీవో బన్సీలాల్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, పలువురు అధికారులు ఉన్నారు.

ఆరంభ శూరత్వం



నిరుపయోగంగా టీచర్ ట్రైనింగ్ సెంటర్ భవనం

హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయం వెనక రూ. 2కోట్లతో నిర్మించిన టీచర్ ట్రైనింగ్ సెంటర్ కం టౌన్ హాల్ ప్రారంభించిన ఏడాదికే నిరుపయోగంగా మారింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో తుమ్మలు, తుప్పలు మొలిచాయి. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ భవనంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలో అధికారిక సమావేశాలు, సభలు నిర్వహించుకోవడానికి భవనం లేక ఇబ్బందులు పడుతున్న సందర్భాల్లో దీనిని ఎందుకు వినియోగంలోకి తేవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలో రూ. 2 కోట్లతో టీచర్ ట్రైనింగ్ సెంటర్ కం టౌన్ హాల్ నిర్మాణానికి 20.6.2018న అప్పటి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. దీనిని 5.5.2023న అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ప్రారంభించిన కొత్తలో ఒకటిరెండు సమావేశాలే జరిగాయి. తరువాత నిర్వాహణ లేక నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని టీచర్స్ ట్రైనింగ్‌తో పాటు ఇతర సభలు, సమావేశాలకు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.

- హుస్నాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)



భవన ప్రాంగణంలో మొలిచిన పిచ్చిమొక్కలు